క్లుప్తంగా

అడవివరంలో పోలీసుల తనిఖీలు



అడవివరంలో తనిఖీ నిర్వహిస్తున్న సెబ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, తదితరులు

సింహాచలం : అడవివరం జంక్షన్‌లో గురువారం సెబ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా మద్యం, నగదు తరలింపు, గంజాయి, డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. వాహనాలు ఆపి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. సెబ్ జేడీ ఆదేశాల మేరకు సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు తనిఖీలు నిర్వహించారు. మద్యం, నగదు, గంజాయి అక్రమ రవాణాపై ఎవరైనా సమాచారమిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని సుబ్బారావు తెలిపారు. పెందుర్తి సీఐ సరోజాదేవి, రాజుల నాయుడు, ఎస్‌ఐలు మహేష్, వేణు పాల్గొన్నారు.

ఒడిశా మద్యం స్వాధీనం



సీఐ బాలసూర్యారావు, సిబ్బంది స్వాధీనంలో 146 ఒడిశా మద్యం సీసాలు

పరవాడ: మండలంలోని తానాంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు పర్యవేక్షణలో పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. పెందుర్తికి చెందిన సుశాంత్ పాత్రో, కొత్తవలసకు చెందిన లంక గౌరీశంకర్ కలిసి తమ బొలెరో వాహనంలో ఒడిశా జిల్లా బరంపురం నుంచి ఒడిశా మద్యం 146 క్వార్టర్ సీసాలను తీసుకొని వస్తుండగా.. తానాం సమీపంలో పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. దాడిలో లభ్యమైన మద్యం సీసాల విలువ రూ.19,194 ఉంటుందని, మద్యం సీసాలతో సంబంధం ఉన్న ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసి, వాహనాన్ని సీజు చేశామని సీఐ బాలసూర్యారావు తెలిపారు.

మహిళా కళాశాలలో 'కెరీర్ గ్రోత్'పై శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు కెరీర్ గ్రోత్‌పై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణ పద్మ, కామర్స్ అధ్యాపకురాలు డాక్టర్ నాగశాంతి, ప్రొగ్రామ్ కో ఆర్డినేటర్ ఎం. జగదీష్, జేకేసీ మెంటార్ డి. ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్తెమ్మతల్లి పండగ మహోత్సవం

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కాకానినగర్‌లోని సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ మహోత్సవం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఉదయం 7.30గంటలకు సత్తెమ్మతల్లి వేపచెట్టుకు పసుపు కుంకుమలు చూపించి పంచామృతాలతో అభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం 4గంటలకు అమ్మవారికి దీపాలంకరణ ఉంటుంది. 30న అమ్మవారికి పసుపు కుంకుమలతో అభిషేకం, సాయంత్రం 3గంటల నుంచి ఊరేగింపు ఉంటుంది. 31న పండగ మహోత్సవంలో భాగంగా అమ్మవారి ఘటాలు ఊరేగింపు, సాయంత్రం 4గంటలకు పరస మహోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహకులు సమ్మెట్ల రామకృష్ణ తెలిపారు. కాకానినగర్, బుచ్చయ్య నగర్, కనకమహాలక్ష్మి నగర్, విమాన్ నగర్, వినోద్ నగర్, సాకేతపురం, దుర్గాపురం గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మ వారి దర్శనానికి రానున్నందున ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నోరు తెరిస్తే అబద్ధం..!

- పెందుర్తిలో జరిగిన అభివృద్ధిపై 'పంచకర్ల' మాయమాటలు
- 2009లో డాక్టర్ వైఎస్సార్ శంకుస్థాపన చేసిన లా వర్సిటీని తెచ్చింది ఆయనే అట..!
- 2008లో సబ్బవరంలో మంజూరైన డిగ్రీ కళాశాల తీసుకొచ్చిందీ తానేనంటూ బొంకులు
- రమేష్‌బాబు రాజకీయాల్లోకి రాక ముందు వచ్చినవీ తానే తెచ్చినట్లు బిల్డప్
- పంచకర్ల రమేష్ తీరుపై నవ్వుకుంటున్న జనం



డాక్టర్ వైఎస్సార్ హయాంలో మంజూరైన లా యూనివర్సిటీ



2008లో కేబినెట్ ఆమోదం పొందిన సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పెందుర్తి : సమకాలీన రాజకీయాల్లో గుక్క తిప్పుకోకుండా అబద్ధాలు చెప్పడం.. తాను చేయనిదీ చేశానని డబ్బాలు కొట్టుకోవడం టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య... తెలుగుదేశం కేడర్ అంతా కూడా దాదాపు చంద్రబాబు పంథాలోనే నడుస్తుంటారు... అయితే ఆరు నెలలు సహవాసం చేస్తే వాళ్లు వీళ్లవుతారన్న చందంగా చంద్రబాబు రాజకీయ 'బొంకులు' జనసేన కూడా నేర్చుకుంది. అధికార దాహంతో జతకట్టిన టీడీపీ – జనసేన పార్టీలు తప్పుడు ప్రచారం చేయడంలోనూ జతగానే నడుస్తున్నాయి. తాజాగా పెందుర్తి నియోజకవర్గ టీడీపీ – జనసేన – బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచిన జనసేన నేత పంచకర్ల రమేష్‌బాబు కూడా చంద్రబాబు తరహాలోనే సొంత డబ్బా కొట్టుకుంటున్నారు.

పెందుర్తి నియోజకవర్గంలో తాను రాజకీయాల్లోకి రాకముందు జరిగిన అభివృద్ధిని కూడా తన ఖాతాలో వేసుకుంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. పంచకర్ల రమేష్ బాబు ప్రచార ఆర్భాటం ఏ స్థాయికి దిగజారిందంటే... 1994లో దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు శంకుస్థాపన చేసిన హిందుజా పవర్ ప్లాంట్‌ను కూడా తానే తీసుకొచ్చాను అన్నంతగా. ఇదే కాదు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సబ్బవరంలో మంజూరైన దామోదరం సంజీవయ్య లా యూనివర్సిటీ, సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కూడా పంచకర్ల తన ఖాతాలో వేసుకోవడం విడ్డూరం.

అలా ఎలా సాధ్యమయ్యా...??

- పరవాడ సమీపంలోని హిందుజా పవర్ ప్లాంట్ 1994లో దివంగత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు హయాంలో మంజూరైంది. అదే ఏడాది శంకుస్థాపన కూడా చేశారు. కొన్నేళ్ల న్యాయపరమైన చిక్కుల తర్వాత ప్లాంట్ ప్రారంభమైంది. అప్పటికి పంచకర్ల రమేషబాబు రాజకీయాల్లోనే కాదు విశాఖలోనే లేరు. మరి హిందుజాని ఆయన ఎలా తెచ్చారో పంచకర్లకే తెలియాలని స్థానికులు అంటున్నారు.
- సబ్బవరంలోని దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం 2008 జూన్ 30న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కేబినెట్ ఆమోదం పొందింది. 2008 జూలై 8న అసెంబ్లీలో బిల్లు పాసైంది. 2008 సెప్టెంబర్ 23న గవర్నర్‌కు బిల్లు సమర్పించగా వెంటనే ఆమోదం పొందింది. 2009 ఫిబ్రవరి 21న సబ్బవరం కేంద్రంగా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అప్పటికి రాజకీయాల్లో కూడా లేని పంచకర్ల రమేష్ బాబు దీన్ని ఎలా మంజూరు చేయించారో జనసేన కార్యకర్తలే చెప్పాలి.
- సబ్బవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2008లో స్థల సేకరణ జరిగింది. 2009లో కళాశాల నిర్మాణం జరిగింది. అప్పటికి ఎమ్మెల్యే కాని పంచకర్ల ఈ కళాశాలను తెచ్చానని చెప్పడం మరీ విడ్డూరం. ఇలా పెందుర్తిలో జరిగిన అభివృద్ధి అంతా తానే చేశానంటూ సొంత డబ్బా కొట్టుకుంటూ చంద్రబాబు బాటలో పంచకర్ల ముందుకు సాగుతున్నారు. అయితే పంచకర్ల పాచికలు పెందుర్తిలో పారవని ప్రత్యర్థులు కౌంటర్ చేస్తున్నారు. ఆయన మాయమాటలు నమ్మేవారు ఎవరూ లేరని స్థానికులు అంటున్నారు.

ఘనంగా ముత్యమాంబ పండగ



వేపగుంటలో పూజలందుకున్న ముత్యమాంబ అమ్మవారు

పెందుర్తి : వేపగుంటలో కొలువుదీరిన 15 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత ముత్యమాంబ అమ్మవారి వార్షిక పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు – కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూర్తిగా వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయం మొత్తం విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు వేపగుంట పుర వీధుల్లో వేడుకగా సాగింది. అనుపోత్సవం ఘనంగా చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్నికల నియమావళి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

విశాఖ సిటీ: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, నాలుగు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాలను నియమించారు. ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై ఎంసీసీ బృందాలు విచారణ చేపట్టి నివేదికను సమర్పించనున్నాయి. ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశారు.

పెందుర్తి నియోజకవర్గం

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు		
టీమ్–1	జి.వి.రవికుమార్	పెందుర్తి ఎంపీడీవో 9849900825
	జి.అప్పారావు	హెచ్‌సీ 9989126938
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు		
టీమ్–1	కె.వెంకట్‌రావు	పెందుర్తి ఎంపీడీవో సూపరింటెండెంట్ 9866606722
	ఎం.ప్రకాష్‌బాబు	హెచ్‌సీ 9502103107

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పెందుర్తి: రాంపురంలో 11 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. బాపూజీనగర్, సాధుమఠం, సాయిరాం లేఅవుట్, హర్షవర్ధన్‌నగర్, ఏకలవ్యకాలనీ, లయోల ఐటీఐ, మోర్ గొడౌన్, రాయవాని కల్లాలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అడవివరం ఎస్సీ కాలనీలో ఫ్యాన్ గుర్తు చూపిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ప్రచారంలో వైఎస్సార్ సీపీ 98వ వార్డు నాయకులు

సింహాచలం : రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ప్రజా సంక్షేమ పాలన కొనసాగాలంటే మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనతోపాటు విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జీవీఎంసీ 98వ వార్డు పరిధి పాత అడవివరంలోని ఎస్సీ కాలనీ నుంచి గురువారం ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఎస్సీ కాలనీ, అడవివరం ప్రధాన రహదారి, గాంధీ నగర్, తోటవీధి, కాపువీధి, రామాలయం వీధి, మధ్య వీధి, పోస్టాఫీసు వీధి, బ్రాహ్మణ వీధి, రాజ వీధి, మార్కెట్ ఏరియాలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో వైఎస్సార్ సీపీ తరపున రెండోసారి భీమిలి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారన్నారు. ప్రజలంతా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కులమతాలు, ప్రాంతాలు, పార్టీలు, వర్గాలు చూడకుండా అర్హులందరికీ గత ఐదేళ్లలో సంక్షేమ పథకాలు అందించామన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలకు పెద్దపీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. అవినీతి, లంచాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

సీఎం జగన్ నాయకత్వాన్ని బలపరచండి

గతంలో ఏదైనా సమస్య వుంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని... ప్రస్తుతం సమీపంలోని సచివాలయానికి వెళ్తే పరిష్కరిస్తున్నారన్నారు. విశాఖను రాజధాని చేయడానికి సీఎం జగన్ సిద్ధమయ్యారన్నారు. ఎన్నికల తర్వాత మరోసారి ముఖ్యమంత్రిగా విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. విశాఖ రాజధాని కావాలనుకునే వారంతా పార్టీలకు అతీతంగా సీఎం జగన్ నాయకత్వాన్ని బలపరచాలన్నారు. సింహాచలం దేవస్థానం భూ సమస్య కోర్టు పరిధిలో ఉందని, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు అధికారికంగా అనుమతులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అడవివరం బీఆర్‌టీఎస్ బాధితులకు ఇళ్ల పట్టాలు, నష్ట పరిహారం, టీడీఆర్‌లు ఇచ్చామన్నారు. 529వ నంబరు సచివాలయం పరిధిలో ఐదేళ్లలో రూ.11 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ బస్సు యాత్రకు జనం నీరాజనం పలుకుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు పీతల అప్పలరాజు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, కె.సింహాద్రి, వరదా నర్సింహమూర్తి, లోగిశ మాధవరావు, లండ భాస్కర్, లండ వెంకటరమణ, ఆదిరెడ్డి, బొట్టా శ్రీను, లండ శ్రీను, ఎస్.అప్పారావు, పాలూరి సూరిబాబు, మజ్జి ధర్మా, ఆర్.వర్మ, మజ్జి అప్పలరమణ, ఎస్సీ కాలనీ నాయకులు వంగలపూడి అప్పారావు, ఎం.శివ, ఎస్.శివ, పండు, వంగలపూడి వివేక్ పాల్గొన్నారు.

'మూల్యాంకన విధుల నుంచి మినహాయించాలి'

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విధులకు ప్రత్యేక అవసరాలు ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమండి పైడిరాజు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి గురువారం డీఈవో ఎల్.చంద్రకళకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా మూల్యాంకనం కేంద్రంలో తగిన మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు మూల్యాంకన విధులు కేటాయించవద్దని, ఈ విషయంలో వారి అభ్యర్థనను పరిశీలించాలని కోరారు. దీనిపై డీఈవో సానుకూలంగా స్పందించారని పైడిరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేముడు బాబు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ నేడు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఘనంగా ఉక్కు భద్రతా దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న జేసీఐఎఫ్ శివశంకరరెడ్డి, సీజీఎం సోఢీ

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్‌లో జాతీయ ఉక్కు భద్రతా దినోత్సవం (స్టీల్ సేఫ్టీ డే)ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన వేడుకలను రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర రెడ్డి, స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోఢీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆహూతులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శివశంకరరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భద్రతతో విధులు నిర్వహించడం ద్వారా ప్రమాద రహిత పరిశ్రమగా స్టీల్‌ప్లాంట్‌ను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సీజీఎం ప్రవీణ్ కుమార్, భద్రతా విభాగాధిపతి డి.రామ్‌ప్రసాద్‌తో, పలువురు జీఎంలు, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బూడి ముత్యాలునాయుడుకు సత్కారం



అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా నియమితుడైన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడును గురువారం తారువలోని ఆయన స్వగృహంలో పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, వెన్నల రేగారావు, సింహాద్రి, పార్టీ ముఖ్య నేతలు ఉన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న తిరువీధి



అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న స్థానాచార్యులు, అర్చకులు తదితరులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా గురువారం సాయంత్రం అప్పన్నకు సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవిలను శోభాయమానంగా ముస్తాబు చేసి సర్వజన మనోరంజనిపై వేంజేపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధిల్లో నిర్వహించిన తిరువీధి నేత్రపర్వంగా సాగింది. స్వామికి ఘనంగా హారతి సమర్పించారు. సింహగిరి మాడ వీధులు జనసంద్రంగా మారాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు పెద్ద రాజు, రుత్వికులు, పారాయణదారులు నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మతల్లి అనుపోత్సవం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



అంతకాపల్లిలో ముత్యాలమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం అంతకాపల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో కొలువైన శ్రీముత్యాలమ్మ అమ్మవారి అనుపు మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. దూప దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశబుూరు. అమ్మవారి దర్శనానికి పెద్దెత్తున తరలివచ్చిన భక్తులకు క్యూలైన్లలో వాటర్, మజ్జిగ ప్యాకెట్లు, ప్రసాదాల వితరణ చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిదిలో భారీ అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాణసంచా పేల్చి సందడి చేశారు. ఆలయంతోపాటు గ్రామంలో విద్యుత్ దీపాలంకరణతో అమ్మవారి అనుపు మహోత్సవం వైభవంగా జరిగింది.

ముత్యాలమ్మను దర్శించుకున్న అదీప్‌రాజ్ దంపతులు

అంతకాపల్లిలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను జ్ఞాపికతో సత్కరించారు. ఆయనతోపాటు అమ్మవారిని దర్శించుకున్న వారిలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గండి రవి, బోను గంగునాయుడు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు తదితరులు ఉన్నారు.

మాతృమూర్తి సేవా పురస్కారాల ప్రదానం

సీతంపేట: మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ మేడా మస్తాన్‌రావు ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పలువురికి మాతృమూర్తి సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ వి.చిట్టిబాబు, మా సంస్కృతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు లక్ష్మీభార్గవి చేతుల మీదుగా పురస్కారాలను అందించారు. తల్లిని కంటికి రెప్పలా, ప్రేమగా చూసుకుంటున్న కొడుకులు, కూతుళ్లు ఐదుగురిని పురస్కారాలకు ట్రస్టు ఎంపిక చేసింది. కళ్లపల్లి జగదీశ్వరరావు, కొణతం సేతు మాధవరావు, అనంతశెట్టి జనార్ధనరావు, వప్పంగి అప్పలరాజు, గోగినేని రాధికలను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఏడేళ్లుగా మాతృమూర్తి పురస్కారాలు అందజేస్తున్న మేడా మస్తాన్‌రావు ఎందరికో స్ఫూర్తినిస్తూ, ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత వేముల భాస్కరాచారి, విశ్రాంత లేబర్ కమిషనర్ డి.ఆర్.కె. రావు, ట్రస్టు ఉపాధ్యక్షులు మేడా పద్మావతి, సభ్యులు మేడా శివారెడ్డి, మేడా భరత్‌కుమార్, ప్రసన్న లక్ష్మి, భార్గవి, శంతన్, అక్షర్, అన్విత, అభిరామ్, పి.లలిత తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు నియంత్రించాలి

మహారాణిపేట : మాతాశిశు మరణాలు నిరోధించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల వ్యవధిలో జిల్లాలో ఆరు మాతృ మరణాలు సంభవించాయన్నారు. లంకెలపాలెంలో రెండు, బక్కన్నపాలెం, ఏకేసీ కాలనీ, కణితి, శ్రామికనగర్ ప్రాంతాల్లో ఒక్కొక్క మరణం సంభవించాయన్నారు. ఈ విషయమై సంబంధిత వైద్యులు, ఏఎన్‌ఎంల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదన్నారు. ఏఎన్‌ఎంలు గర్భిణుల పేర్లు నమోదు చేసుకున్న నాటి నుంచి వారికి తగిన వైద్యం అందించాలన్నారు. భవిష్యత్తులో మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయ ఆస్పత్రుల అధికారి డాక్టర్ రమేష్‌కిషోర్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీవో జయదేవి, విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, కేజీహెచ్ ఎనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ జీవీ గణేష్, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ వీవీ శ్రీనివాసరెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్ పి.ఉష, డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు పాల్గొన్నారు.